
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

3

బుధవారం 5 నవంబరు 2025



సిద్దిపేటలో పూజ సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

కార్తీక పౌర్ణమి సందడి

సిద్దిపేట కల్చరల్/కొమురవెల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట మార్కెట్‌లో సందడి నెలకొన్నది. పూజకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. పట్టణంలోని రైతు బజార్, హౌజింగ్ బోర్డు, గాంధీ సర్కిల్ వద్ద విక్రయిస్తున్న ఉసిరి కాయలను, దివ్వెలను, పువ్వులను కొనుగోలు చేశారు. దీంతో పట్టణంలో సందడి నెలకొన్నది.

మల్లన్న ఆలయంలో కార్తీక శోభ

కార్తీకమాసం సందర్భంగా మంగళవారం మల్లన్న ఆలయ మహామండపంలో ఉత్సవమూర్తుల ఎదుట కార్తీక శుద్ధ చతుర్దశి సందర్భంగా 14వ రోజు లలితా సహస్రనామ పారాయణం, దేవి కవచ పారాయణ పూర్వక దీపోత్సవం నిర్వహించారు.



మల్లన్న ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



కళాశాలల బంద్ కొనసాగింపు

సిద్దిపేట కల్చరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ కళాశాలల బంద్ జిల్లాలో కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ సహా అన్ని వృత్తి విద్యా కళాశాలలు సమ్మెలో పాల్గొన్నాయి. జిల్లావ్యాప్తంగా 40 కోట్లకు పైగా బకాయి ఉన్నందున, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి బకాయిలు విడుదల చేయాలని యజమాన్యాలు కోరాయి. సమ్మెను నీరుగార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, నిధులు విడుదలయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని, ఇప్పటికే అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామని యజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశాయి.

రామ్‌మందిర్‌లో మాధవానంద స్వామి

ఆశ్రమం ఏర్పాటు పనులు వేగవంతం చేయండి

- రాంనగర్ భజన మండలికి సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పాత బస్టాండ్ సమీపంలోని రాంనగర్ రామ్ మందిరంలో మాధవానంద స్వామి ఆశ్రమం ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి రాంనగర్ భజన మండలికి సూచించారు. మాధవానంద స్వామితో కలిసి మంగళవారం ఆయన జగ్గారెడ్డి రామ్ మందిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. రామ్ మందిర్‌లో మాధవానంద స్వామి భక్తులతో సత్సంగ్ చేసేందుకు, భక్తులను కలిసేందుకు వీలుగా తగిన ఏర్పాటు చేయాలన్నారు. ఆలయంలో ఆశ్రమం నీటి అవసరాలు తీర్చేలా తక్షణమే బోరు బేయించి నీటి ట్యాంకు నిర్మించాలని సూచించారు. ఆశ్రమంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు అనుకూలంగా ఉండేలా ప్రత్యేకంగా వసతులు కల్పించాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



మాధవానందస్వామితో మాట్లాడుతున్న జగ్గారెడ్డి



రామ్‌మందిర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాధవానంద స్వామి, జగ్గారెడ్డి

జలగండం

- హుస్నాబాద్‌కు శాపం!
- వానొస్తే వ్యాపారుల్లో గుబులు
- 'నేషనల్ హైవే కాలువ' వచ్చినా తప్పని వరద కష్టాలు
- శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపు



ఇటీవల కురిసిన వర్షానికి వరద నీరు దుకాణంలోకి చేరడంతో ఎత్తిపోస్తున్న వ్యాపారులు

సిద్దిపేట-హన్మకొండ ప్రధాన రహదారి... ఇది హుస్నాబాద్‌కు జీవనాడి. కానీ యేటా వర్షాకాలం వచ్చిందంటే ఈ రోడ్డు చెరువును తలపిస్తుంది, కిలోమీటర్ల మేర నడుములోతు నీరు ప్రవహిస్తుంది. గత 13 ఏళ్లుగా హుస్నాబాద్ వ్యాపారులకు, ప్రజలకు ఈ జలగండమే పెనుశాపంగా మారింది. జాతీయ రహదారి (ఎన్‌హెచ్) కాలువలు నిర్మించినా వరద ఉధృతి తగ్గకపోగా, యేటా లక్షల రూపాయల ఆస్తి నష్టం జరుగుతోంది. తమకు ఈ వరద తిప్పల నుంచి విముక్తి ఎప్పుడు? అని పట్టణ ప్రజలు, వ్యాపారులు కన్నీటిపర్యంతమవుతున్నారు.



ఇటీవల కురిసిన వర్షంతో జలమయమైన హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారి

హుస్నాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్ పట్టణానికి జలగండం ముంచుకొస్తుంది. వ్యాపారుల్లో గుబులు, ప్రజల్లో ఆందోళన మొదలవుతుంది. చిన్నపాటి వర్షం వచ్చినా పట్టణంలోని ప్రధాన రహదారి అయిన సిద్దిపేట-హన్మకొండ రోడ్డు వరద నీటితో జలమయమవుతోంది. పట్టణంలోని సిద్దిపేట రోడ్డు, సహకార బ్యాంకు, బస్టాండ్ నుంచి యూకో బ్యాంకు, మల్లెచెట్టు చౌరస్తా, అనభేరి చౌరస్తా వరకు దాదాపు కిలోమీటరు దూరం వరకు నీరు నిలిచి వాగులను తలపిస్తుంది. వరద నీరు నేరుగా దుకాణాల సముదాయాల్లోకి చొచ్చుకు రావడంతో వ్యాపారులు ఏటా రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ముఖ్యంగా వస్త్ర దుకాణాలు, కిరాణా, ఫెర్టిలైజర్ షాపుల యజమానులకు ప్రతి ఏడాది భారీ నష్టాలు తప్పడం లేదు.

ఎన్‌హెచ్ కాలువ వచ్చినా.. తగ్గని కష్టం!

గతంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు చిన్నవిగా ఉండటంతోనే ఈ ఇబ్బందులు వస్తున్నాయని భావించారు. ఇటీవల మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి (ఎన్‌హెచ్) నిర్మాణంతో హుస్నాబాద్ పట్టణంలో ఈ జలగండం తొలగిపోతుందని పట్టణ ప్రజలు సంతోషించారు. కానీ, సమస్య యథావిధిగా కొనసాగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి పట్టణం జలదిగ్బంధంలో చిక్కుకోగా, ప్రధాన రహదారిపై నడుములోతు వరద నీరు ప్రవహించింది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన వరద నీటి కాలువ కేవలం ఒక మీటరు వెడల్పు, మీటరుపావు లోతు మాత్రమే ఉంది. పైనుంచి భారీగా వచ్చే వరద ప్రవాహానికి ఈ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో నీరు రోడ్డుపై ప్రవహించడమే కాకుండా, దుకాణాలు, ఇళ్లలోకి చేరి వ్యాపారులు, గృహ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు.



దుకాణంలోకి వరదనీరు చేరడంతో తడిసిన ఎరువుల బస్తాలు

హుస్నాబాద్‌లో వర్షం

హుస్నాబాద్ పట్టణంలో మంగళవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లు జలమయమయ్యాయి. పట్టణంలోని ఆరపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షానికి కాంటా వేసిన ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అస్తవ్యస్తంగా కాలువ నిర్మాణం

మెదక్-ఎల్కతుర్తి ఎన్‌హెచ్ నిర్మాణంలో భాగంగా హుస్నాబాద్‌లో ఇరువైపులా చేపట్టిన మురుగు కాలువ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉందనే ఆరోపణలున్నాయి. గతంలో ఉన్న మురుగు కాలువను తొలగించి దాని స్థానంలో చేపట్టిన ఈ కాలువలో శిథిలాలు, పేరుకుపోయిన రాళ్లు, కట్ చేసిన విద్యుత్ స్తంభాలు, ఇతర వస్తువులు అలాగే ఉంచి

మిగతా 6వ పేజీలో

భూ భారతి వేగం పెంచండి

- రైతులు, మిల్లర్లకు ఇబ్బందులు రాకుండా చూడాలి : కలెక్టర్ హైమావతి

సిద్దిపేట నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని భూ భారతి దరఖాస్తుల ప్రక్రియలో వేగం పెంచాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రైతులకు, మిల్లర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి వేర్వేరుగా సర్వే, ల్యాండ్ శాఖ కార్యకలాపాలు, పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. భూ భారతి దరఖాస్తుల డిస్పోజల్‌లో సర్వే అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ హైమావతి అన్నారు. ఎఫ్ లైన్ పిటిషన్‌లు, అప్పీళ్లు, డీమార్కెటింగ్‌లు, ప్రజావాణి దరఖాస్తుల డిస్పోజల్ ప్రక్రియపై ఆరా తీశారు. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్లను ఒక ప్రణాళిక ప్రకారం ఫీల్డ్ పరిశీలించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి నెలా మండల సర్వేయర్‌లు ఆయా తహసీల్దార్లకు టూర్ డైరీలు సమర్పించాలని చెప్పారు. టీజీఐబీసీకి అందించిన ల్యాండ్ సర్వేయర్ శాఖలో పెండింగ్ దరఖాస్తులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. గతంలో జిల్లాకు సంబంధించిన సర్వే రికార్డులన్నింటినీ సేకరించి భద్రపరచుకోవాలని సర్వే, ల్యాండ్ ఏడీ వినయ్ కుమార్‌ను ఆదేశించారు. ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని, సర్వే శాఖలో పెండింగ్ దరఖాస్తులను డిసెంబరు లోపు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

మిల్లర్లు, అధికారులతో సమీక్ష

2025-26 గానూ పత్తి మార్కెట్ ఎంఎస్‌పీ కింద పత్తి సేకరణకు సంబంధించి మిల్లర్లు, అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. మిల్లర్లు ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4, ఎంపిక విధానం వలన జిల్లా పరిధిలో మొత్తం 22జిన్నింగ్ మిల్లులకు గాను 10 మిల్లుల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదని తెలిపారు. దీని వల్ల మిల్లర్లతో పాటు రైతులకు ఇబ్బందులు కలగకుండా వారికి సహాయ సహకారాలు అందించేలా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. రైతులు పండించిన పంటను మిల్లుల సామర్థ్యాన్ని బట్టి పూర్వ జిల్లాల పరిధిలో యాప్ ద్వారా వారే మిల్లులను ఎంచుకోగలుగుతారని, మిల్లుల సామర్థ్యాన్ని మించి పంట నిల్వలు ఉన్నట్లయితే, మరో మిల్లుకు పంటను తరలించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. తేమ శాతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, మార్కెటింగ్ డీఎం నాగరాజు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నారాయణ, మిల్లర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

హుస్నాబాద్ : హుస్నాబాద్ డివిజన్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన డివిజన్‌లోని అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు ఫోర్ లైన్ పనుల్లో 90 శాతం చెట్ల తొలగింపు పనులు పూర్తి చేయాలని, ఎలక్ట్రికల్ లైన్ తొలగించడంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సముద్రాల, కోహెడ బీటీ రోడ్డు పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని చెప్పారు. హుస్నాబాద్ రామవరం రోడ్డు, అక్కన్నపేట నుంచి కొత్తకొండ రోడ్డు పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు డిసెంబరు చివరి నాటికి వీటిని పూర్తి చేయాలని చెప్పారు. ముందుగా హుస్నాబాద్ మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆర్డీవో రామ్మూర్తి, డీఆర్డీవో జయదేవ్‌ఆర్యా ఉన్నారు.

చిన్నతనం నుంచే వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

- రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- పాఠశాలలో వ్యవసాయ ప్రదర్శన పరిశీలన



ప్రదర్శనలను పరిశీలిస్తున్న కోదండరెడ్డి

వర్గల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నతనం నుంచే వ్యవసాయంపై దృష్టి పెట్టాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. వర్గల్ మండలం తునికిఖాల్సా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలని, ఆ దిశగా పాఠశాలలో వ్యవసాయం, పనిముట్లు, విత్తనాలు, సేంద్రీయ ఎరువులపై అవగాహన కల్పించడం శుభపరిణామం అన్నారు. ఎద్దులు, నాగలి, ట్రాక్టర్, చేదబావి, గుడిసె, మంచె, నిచ్చెన, కొడవలి, గడ్డపార, పార, కుందన, కుదురు తదితర పాత, కొత్త వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, ఉపకరణాలు, విత్తనాల ప్రదర్శన అందరినీ ఆకర్షిస్తున్నాయని అభినందించారు. కార్యక్రమంలో వేలూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కృష్ణసౌజన్య, ప్రధానోపాధ్యాయులు శ్యామ్‌రాథోడ్, ఉపాధ్యాయులు పులిరాజు, మంజులారెడ్డి, విమల, రుక్మిణీ, శ్రీనివాస్, జరీనా, ఫర్హీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సగం రోడ్డు సంతకే..!

- మార్కెట్ సౌకర్యం ఉన్నా రహదారిపైనే..
- అలంకారప్రాయంగా గజ్వేల్ సమీకృత మార్కెట్
- ఫుట్‌పాత్‌లు, రోడ్డు ఆక్రమణతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇక్కట్లు
- తైబజార్ వ్యాపారులతో అధికారులు కుమ్మక్కు..!

5

డ్రైవరన్నా.. జరపైలం

- అప్రమత్తతే అసలైన రక్ష
- జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చు
- అతివేగానికి కళ్లెం, మత్తు పదార్థాలకు దూరం ముఖ్యం
- ప్రయాణికులూ అప్రమత్తంగా ఉండాలని సూచన

5

బిల్లు రాలేదని పంచాయతీ కార్యాలయంలో మకాం

- గ్యాస్ స్టవ్, నిత్యావసరాలు, పడకమంచంతో లబ్ధిదారుడి వినూత్న నిరసన
- కేసు నమోదు చేసిన పోలీసులు
- తోటపల్లి గ్రామంలో ఘటన

5

యువజనోత్సాహం

- ఈ నెల 18న యూత్ ఫెస్టివల్
- సైన్స్ మేళాకు ఏర్పాట్లు
- 15 నుంచి 29 ఏళ్ల వారు అర్హులు



సిద్దిపేట కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేయటం.. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయటం, ప్రోత్సహించటం లక్ష్యంగా స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ముందస్తుగా యువజన ఉత్సవాల (యూత్ ఫెస్టివల్)కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయం వేదికగా ఈ వేడుకలు జరగనుండగా, సైన్స్ మేళా మాత్రం టీటీసీ భవనంలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

వివిధ విభాగాల్లో పోటీలు

యువజన ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. వివిధ విభాగాల్లో గ్రూప్ లేదా సోలోగా పాల్గొనవచ్చు. ముఖ్యంగా, జానపద నృత్యం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, కవితలు వంటి సాంస్కృతిక కార్యకలాపాల్లో పోటీలు ఉంటాయి. సాంస్కృతిక పోటీలతో పాటుగా సైన్స్ మేళాను ఏర్పాటు చేసి యువతలోని ప్రతిభను చాటే అవకాశం కల్పించారు. ఇదే రోజు టీటీసీ భవనంలో జరిగే సైన్స్ మేళాలో ప్రదర్శించే ఎగ్జిబిట్లలో ఇన్నోవేషన్ ఇన్ అప్రోచ్, క్వాలిటీ ఆఫ్ ప్రజంటేషన్, ఇంపాక్ట్ అనే మూడు అంశాలను పరిగణలోకి తీసుకుని తదుపరి స్థాయికి ఎంపిక చేస్తారు.

పాల్గొనడానికి అర్హతలు

యూత్ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి సిద్దిపేట జిల్లాకు చెందినవారై ఉండాలి. 15 నుండి 29 సంవత్సరాలు వయసు ఉన్నవారు అర్హులు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతి విభాగం నుంచి ప్రథమ స్థానం పొందిన జట్టును ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.





దేశంలోనే సిద్దిపేటకు ప్రత్యేకత ఉంది

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



సిద్దిపేటకల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అన్నిజీవుల్లో దైవత్వం ఉందని చెప్పిన మొదటివారు యాదవులని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సిద్దిపేటలోని పోచమ్మ ఆలయం ముందు ఏర్పాటు చేసిన సదర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.. అంతకుముందు మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు సదర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెంకన్న మాట్లాడుతూ సిద్దిపేటకు భారతదేశంలోనే ప్రత్యేకత ఉందన్నారు. అనంతరం యాదవుల గొప్పతనాన్ని కొనియాడారు. "మందెంట పోతుండు ఎల మంద" అని పాట పాడి హుషారు నింపారు. హరియాణా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన దున్నల విన్యాసాలు ఆకట్టుకున్నాయి..

డప్పు కొట్టడానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం


మల్లయ్య (ఫైల్)

రాయపోల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రాజకీయ పార్టీల ప్రచారం కోసం డప్పు కొట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లమొల్ల మల్లయ్య(50) ఐదు రోజుల క్రితం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో డప్పు కొట్టేందుకు హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆదివారం అమీర్‌పేట నాగార్జున కాలనీలో డప్పు కొడుతున్న సమయంలో బీడీ తాగడానికి పక్కకు వెళ్లాడు. అనంతరం ఎంతకూ తిరిగి రాకపోవడంతో మిగతావారు ఎంత వెతికినా ప్రయోజనంలేకుండా పోయింది. బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

వడ్ల కుప్పను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వడ్ల కుప్పను ఎక్సల్ వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే మడూర్ గ్రామానికి చెందిన పోతరాజు శ్యాములు గవ్వలపల్లి గ్రామానికి ఎక్సల్ వాహనంపై బయలు దేరాడు. సంగాయిపల్లి శివారు గవ్వలపల్లి, రామాయంపేట రోడ్డుపై రైతులు వడ్లను ఆరబోశారు. ప్రమాదవశాత్తు వడ్ల కుప్పను ఢీకొని తలకు తీవ్రగాయాలు, రక్త స్రావం అయింది. స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని 108 అంబులెన్సులో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కల్తీ ఆహార వస్తువుల తయారీ కేంద్రాలపై దాడులు

జహీరాబాద్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిజిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీ, హమాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో కల్తీ ఆహార వస్తువులను తయారుచేస్తున్న తయారీ కేంద్రాలపై జహీరాబాద్, చిరాగ్‌పల్లి ఎస్సై వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి మంగళవారం మూకుమ్మడిగ దాడులు చేశారు. అందులో భాగంగ ఆయా తయారీ కేంద్రాల్లో ఎలాంటి ఆహారపదార్థాలు తయారుచేసున్నారని, ఎలాంటి రామెటీరియల్ వాడుతున్నరని వారు గమనించారు. వారు కల్తీ ఆహారవస్తువులను తయారుచేస్తున్నందున వారిపై కేసులు నమోదుచేశామని వారు వివరించారు. పరస్, అభినయశ్రీ తయారీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయని వారు పేర్కొన్నారు. కల్తీ ఆహార పదార్థాలను వాడుతూ పిండివంటలు తయారుచేస్తు ప్రజారోగ్యాలకు హానికలిగించేలా వ్యవహరిస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఆయా తయారీ కేంద్రాల నిర్వాహకులు పరస్‌నాథ్, పేరుమాల్‌లపై కేసునమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని వారు వివరించారు.

బంగారు గొలుసును దొంగిలించిన యువకుడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న యువతి మెడలోంచి బంగారు గొలుసును దొంగలించిన నిందితుడిని రామచంద్రాపురం పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం మాదాపూర్ అదనపు డీసీపీ ఎస్.ఉదయ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరువులోని శ్రీరాం నగర్ కాలనీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని, ఆమె తల్లితో కలిసి గత నెల 27వ తేదీన రామచంద్రాపురంలోని డైమండ్ పాయింట్ వద్దకు ఆటోలో వచ్చింది. తల్లిని ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు వెళ్లే బస్సు ఎక్కించేందుకు వచ్చి, తిరిగి వెళ్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థిని రోడ్డు దాటుతుండగా ఓ యువకుడు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లిపోయాడు. దీంతో ఆ యువతికి మెడకు గాయమైంది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన రామచంద్రపురం పోలీసులు నిందితుడి కోసం సీసీ టీవీ కెమెరాలను పరిశీలించారు. బంగారు గొలుసు దొంగను పట్టుకునేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి గాలించారు. చివరకు నిందితుడు సంగారెడ్డిలోని శాంతినగర్ ప్రాంతానికి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే సయ్యద్ అబ్దుల్లా (31)గా పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి బంగారు గొలుసుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని రిమాండు చేశామని అదనపు డీసీపీ ఎస్.ఉదయ్ రెడ్డి తెలిపారు.

బొలెరో వాహనం ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి


పోగుల యాదగిరి (ఫైల్)

హుస్నాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మంగళవారం ఉదయం సైకిల్‌పై వెళ్తున్న పోగుల యాదగిరి (63)ని వెనుక నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందాడు. తెలిపారు. ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన యాదగిరి పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. హోటల్‌కు సైకిల్‌పై వస్తుండగా హైదరాబాద్‌కు చెందిన ఐస్‌క్రీం సప్లయ్ చేసే బోలెరో వాహనం కరీంనగర్ నుంచి హుస్నాబాద్ మీదుగా హన్మకొండకు వెళ్తూ వెనుక నుంచి అతి వేగంగా వచ్చి సైకిల్‌ను ఢీ కొట్టి 30 అడుగుల దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో యాదగిరి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. యాదగిరి కుమారుడు పోగుల శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

కల్హేర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కల్హేర్ శివారులోని పాత చెరుకు ఫ్యాక్టరీ ఆవరణలో వడ్ల సత్తయ్య(50) అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కల్హేర్ ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యం తాగుడుకు బానిస అయిన సత్తయ్య ఫ్యాక్టరీ ఆవరణలో విగత జీవిగా పడి ఉండటాన్ని గ్రామస్థులు మంగళవారం ఉదయం పోలీసులకు సమచారమందించారు. జీవితంపై విరక్తి చెంది మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఉండవచ్చునని, లేదా ఇంకేదైనా కారణంతో మరణించాడేమోనని అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్.. వృద్ధురాలు బలి

● రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టిన జేసీబీ


కంది, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిర్యక్ష్యపు డ్రైవింగ్‌కు ఓ వృద్ధురాలి నిండు ప్రాణం బలితీసుకున్న సంఘటన మండలకేంద్రమైన కందిలోని లక్ష్మీనగర్ కాలనీ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కందిలోని లక్ష్మీనగర్ కాలనీలో నివాసముంటున్న ఎగ్మో కస్తూరి (60) కంది నుంచి ఇంటికి వెళ్లడానికి కంది ఆర్టీఏ కార్యాలయం వద్ద రోడ్డుదాటడానికి వెళ్తున్న క్రమంలో ఓ క్రేన్ డ్రైవర్ నిర్యక్ష్యంగా క్రేన్‌ను నడుపుతూ ఆమెను ఢీ కొట్టాడు. దీంతో తలకు బలమైన గ్రాయాలై తీవ్ర రక్తస్రావం జరిగి కస్తూరి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన క్రేన్ డ్రైవర్ క్రేన్‌లో నుంచి దూకి పరారయ్యాడు. డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని అతడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదర్ రెడ్డి తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని చిన్నారి మృతి


సాహితి (ఫైల్)

గజ్వేల్ రూరల్ నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనలు ఢీకొని బాలిక మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం లింగారాజ్ పేటలో మంగళవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్కుక్ మండలం పాముల పర్తి గ్రామానికి చెందిన చిన్నబోయిన స్వామి కూతురు సాహితి(7) , కుమారుడు శ్రీ హర్ష(10) లను తన ద్విచక్ర వాహనంపై అత్తవాళ్ల ఇంటికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో గౌరారం నుంచి ముట్రాజ్ పల్లికి వెళ్తున్న మార్గంలో ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టడంతో స్వామి వాహనం పై ఉన్న సాహితి తల పగిలి అక్కడిక్కడే మృతి చెందింది. శ్రీ హర్ష, స్వామికి తీవ్ర గాయాలయ్యాయి, పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి సాహితి మృత దేహాన్ని తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాహం ఇష్టం లేక..


మౌనిక (ఫైల్)

గజ్వేల్ రూరల్ నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇష్టం లేని వివాహం చేస్తున్నారని యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారంసిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని భరత్ నగర్‌కు చెందిన కడారీ మౌనిక (19) కు చేర్యాలకు చెందిన బాలరాజుతో ఈనెల 16న వివాహం నిశ్చయమైంది. కాని మౌనికకు ఇష్టం లేదు. నేను వివాహం చేసుకోను అని తల్లిదండ్రలుకు తెలిపింది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో వంట గదిలోని రేకుల రాడ్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది . ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు స్థానికల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందిందని ధ్రువీకరించారు . కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసున్నామని పోలీసులు తెలిపారు.

కోహెడలో పోలీసుల తనిఖీ

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నార్కోటిక్ డాగ్స్‌తో గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణాపై కిరాణా షాపులు, టీ కొట్టులు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో ఎస్సై అభిలాష్ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్లు ఎవరైనా కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా పాన్ షాపులు, ఇతర షాపులలో అమ్మినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం తంగళ్ళపల్లి గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. యాటెల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి టీజీ 36 టి 5554 లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రైవరన్నా.. జర పైలం

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ
- అతివేగానికి కళ్లెం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ప్రయాణికులూ అప్రమత్తంగా ఉండాలని సూచన

మెదక్ కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. డ్రైవర్లు చేసే చిన్న చిన్న పొరపాట్లు.. అజాగ్రత్తలే అతని ప్రాణాలతో పాటు ప్రయాణికుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుంది. అందుకే డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. తాజాగా కర్నూలులో జరిగిన బస్సు దుర్ఘటనలో మెదక్ జిల్లాకు చెందిన తల్లి కూతురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ సంఘటన డ్రైవర్ల అప్రమత్తత ఎంత అవసరమో మరోసారి గుర్తు చేసింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో డ్రైవింగ్ చేసేటప్పుడు అలసట, నిద్ర కారణంగానే చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం, ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

డ్రైవర్లు తీసుకోవాల్సిన కీలక జాగ్రత్తలివే..

- డ్రైవింగ్ చేస్తుండగా నిద్ర వచ్చినట్లు అనిపిస్తే, వెంటనే వాహనాన్ని రోడ్డు పక్కన సురక్షిత ప్రాంతంలో ఆపి, కాసేపు నడవాలి లేదా తేలిక పాటి వ్యాయామం చేయాలి. ముఖంపై నీళ్ల చల్లుకుని, టీ/కాఫీ/స్నాక్స్ తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.
- రహదారులపై నిర్దేశించిన వేగ పరిమితిలోనే డ్రైవింగ్ చేయాలి. భయం లేదా అసౌకర్యంగా అనిపిస్తే వేగం తగ్గించుకోవాలి. పరిమిత వేగంలో ప్రయాణించడం ఉత్తమం.



- డ్రైవింగ్‌లో పూర్తిగా ఏకాగ్రతతో ఉండాలి. స్మార్ట్‌ఫోన్‌ను అస్సలు ఉపయోగించకూడదు. పాటలు విన్నా, శబ్దం మరీ ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. బయటి శబ్దాలు వినిపించేలా కిటికీని కొద్దిగా తెరిచి ఉంచడం మంచిది.

పొగమంచులో...

పొగమంచులో ఓవర్‌టేక్ చేయవద్దు. మంచులో దూరాన్ని అంచనా వేయడం కష్టం కాబట్టి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. అటువంటి సమయంలో లో-బీమ్ హెడ్‌లైట్‌ను ఉపయోగించాలి. హై-బీమ్ లైట్లు మంచు తుంపరలపై పడి రిఫ్లెక్ట్ అయి, ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తాయి. టెయిల్ లైట్, బ్లింకర్స్‌ను ఉపయోగించడం ద్వారా ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బంది కలగదు.

- రోడ్డుపై ఇతరులను గౌరవిస్తూ, ఓపికగా డ్రైవ్ చేయాలి. ఎవరైనా రోడ్డు దాటుతున్నప్పుడు వేగం తగ్గించి వారికి అవకాశం ఇవ్వాలి.
- దారి మారుతున్నప్పుడు, టర్నింగ్ తీసుకునేటప్పుడు, పార్కింగ్ నుంచి బయటకు వచ్చేటప్పుడు వెనుక వచ్చే వాహనదారులను అప్రమత్తం చేసేందుకు సరైన ఇండికేటర్లను తప్పకుండా ఉపయోగించాలి.
- ముందు, వెనుక వచ్చే వాహనాల నుంచి తగినంత దూరం పాటించాలి. దీనివల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేయాల్సి వచ్చినా ప్రమాదం జరగకుండా చూసుకోవచ్చు.
- డ్రైవర్లు మత్తు పదార్థాలు, మద్యపానానికి దూరంగా ఉండాలి. వాహనం నడిపేటప్పుడు మానసిక ఆందోళన లేకుండా ప్రశాంతంగా ఉండాలి.
- వాహనాలు ఎల్లప్పుడూ మంచి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలి. రెగ్యులర్ మెయింటెనెన్స్ చేయడం ద్వారా ప్రయాణంలో రిపేర్లు రాకుండా నివారించవచ్చు.

ప్రయాణికులకు సూచనలివే..

- బస్సు బయలుదేరే ముందు డ్రైవర్లు టైర్ల కండిషన్, స్టీరింగ్, డీజిల్ ట్యాంక్ పరిస్థితి, అత్యవసర ద్వారాలు సక్రమంగా ఉన్నాయో లేదో తప్పకుండా తనిఖీ చేయాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు కచ్చితంగా అందుబాటులో ఉండేలా చూడాలి.
- ప్రైవేటు ప్రయాణ వాహనాలను కార్గోలుగా ఉపయోగించడం సరికాదు. ఎలక్ట్రానిక్ వస్తువులు, అదనపు లోడు వంటివి బస్సులో తరలించడం వల్ల ప్రమాద సమయంలో అగ్నిప్రమాదాలు మరింత తీవ్రమవుతాయి. వేగంగా వెళ్లే సమయంలో అదనపు లోడు వల్ల బస్సులు అదుపు తప్పే అవకాశం ఉంది.
- అత్యవసర ద్వారం వద్ద స్లీపర్ సీట్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు బయటపడడం కష్టమవుతుంది. ప్రయాణికులు అత్యవసర ద్వారాలు, అద్దాలను పగులగొట్టే పరికరాల గురించి ముందుగా తెలుసుకోవాలి.



డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి...

వాహన డ్రైవర్లు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. ఓవర్ స్పీడ్‌లో వెళ్లకూడదు. తాము ఒక్కరి ప్రాణాలకే కాకుండా, తోటి ప్రయాణికుల కుటుంబ బాధ్యతను కూడా గుర్తెరిగి వాహనం నడపాలి. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా కలిగి ఉండాలి.

- వెంకటస్వామి, మెదక్ జిల్లా రవాణా శాఖ అధికారి

మర్పడగ క్షేత్రంలో వైకుంఠ చతుర్దశి వేడుకలు

కొండపాక, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం వైకుంఠ చతుర్దశి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆరున్నర గంటలకు విజయదుర్గా మాతకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి రుద్రాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద కార్తీక దీపారాధనచేశారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్తీక పౌర్ణమి రోజున సాయంత్రం నుంచి కార్తీక దీపోత్సవం, జ్వాలా తోరణం ఉంటుందని క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ తెలిపారు. భక్తులు పాల్గొని దైవకృప పొందాలని సూచించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కొండపాక, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొండపాక ఆనంద నిలయం ఆవరణలో గల అష్టాదశ శక్తిపీఠ సహిత రామలింగేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలు నేటి నుంచి జరగనున్నాయి. ఆలయ ఆవరణలో కాలభైరవ, వీరభద్ర, చండీశ్వర ప్రతిష్ఠామహోత్సవ నిర్వహించున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలలో నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు, ట్రస్ట్ అధ్యక్షుడు అయిత నాగరాజు తెలిపారు. రోహిణి నక్షత్ర యుక్త ధనుర్లగ్న పుష్కరాంశమున శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య విద్యాశంకరభారతీ మహాస్వామి వారి కరకమలాలచే యంత్ర ప్రతిష్ఠ, విగ్రహస్థాపన తదితర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

'సీపీఐ నేతపై చర్యలు తీసుకోవాలి'

బర్కత్‌పుర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బెదిరింపులకు గురిచేస్తున్న సీపీఐ నేతపై చర్యలు తీసుకోవాలని బాధితుడు తూటి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం చంచల్ చెరువుపల్లి గ్రామానికి చెందిన తనకు వారసత్వంగా వచ్చిన ఎకరం నాలుగు గుంటల పొలం ఉందన్నారు. ఈ పొలానికి సంబంధించిన సమస్య ఉండడంతో సిద్దిపేట జిల్లా సీపీఐ నేత పవన్‌ను సంప్రదించినట్లు తెలిపారు. సమస్య పరిష్కరిస్తానని తన వద్ద రూ.3,06,700 తీసుకున్నాడని తెలిపారు. అయినా సమస్యను పరిష్కరించలేదని, దీంతో తానే నేరుగా కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి సమస్యను పరిష్కరించుకున్నానని తెలిపారు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా ఇవ్వకపోవడమే కాక బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఇతర సీపీఐ నేతలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. సీపీఐ నేత పవన్‌పై సిద్దిపేట టూ టౌన్ పీఎస్‌లో కూడా ఫిర్యాదు చేశానని తెలిపారు. ఇప్పటికైనా తన డబ్బులు తనకు ఇప్పించాలని కోరారు.

అర్హులందరికీ నాణ్యమైన రేషన్ బియ్యం అందాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

నర్సాపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ నాణ్యమైన రేషన్ అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయనతోపాటు సభ్యులు పట్టణంలోని రేషన్ దుకాణం పరిశీలించారు. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం, రెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల తనిఖీ చేశారు. తమకు గోదాం నుంచి బియ్యం తూకంలో తక్కువగా వస్తున్నాయని, తద్వారా నష్టపోతున్నట్లు డీలర్లు వారి దృష్టికి తెచ్చారు. దీంతో అక్కడ ఉన్న బియ్యం సంచిని తూకం వేసి కిలో తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. తమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ కమీషన్ వచ్చేలా చూడాలని రేషన్ డీలర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, సభ్యులు వారికి విన్నవించారు. రెడ్డిపల్లిలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేదని, నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని డీఈవో రాధాకిషన్‌కు కమిషన్ చైర్మన్ ఆదేశించారు. వారి వెంట డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



నర్సాపూర్‌లో రేషన్ దుకాణానికి తనిఖీ చేస్తున్న కమిషన్ బృందం

- పాపన్నపేట/మెదక్ కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని, మెదక్ సీఎస్ఐ చర్చిని మంగళవారం ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు సందర్శించారు. ప్రత్యేక పూజలు, ప్రార్థనం చేశారు.

బిల్లు రాలేదని పంచాయతీ కార్యాలయంలో మకాం

- గ్యాస్ స్టవ్, నిత్యావసరాలు, పడకమంచంతో లబ్ధిదారుడి వినూత్న నిరసన
- కేసు నమోదు చేసిన పోలీసులు
- సిద్దిపేట జిల్లా తోటపల్లి గ్రామంలో ఘటన

హుస్నాబాద్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ బిల్లు ఇవ్వడం లేదని, అందుకు పంచాయతీ కార్యదర్శిని బాధ్యుడిగా చేస్తూ ఓ యువకుడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంటానని పడక మంచం, గ్యాస్ స్టవ్, వస్తువులు పెట్టి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. ఈ సంఘటన తోటపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన శాతవేని ఎలేంద్ర పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 స్క్వేర్ ఫీట్లలోపు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకోవాలని నిబంధనలు ఉన్నాయి. తోటపల్లి గ్రామంలో 17 మంది నిబంధలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. బిల్లురావడానికి ఇబ్బంది ఏర్పడుతుందని, నిబంధనలకు లోబడి ఇంటి నిర్మాణం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. దీంతో 15 మంది నింబంధనలకు లోబడి ఇంటి నిర్మాణాలు చేసుకుని బిల్లులు పొందారు. ఎలేంద్ర మాత్రం 750 ఫీట్లకు మించి ఇంటి నిర్మాణం చేపట్టడంతో మొదట బేస్మెంట్ లెవల్‌కు రూ. 1 లక్ష వరకు బిల్లులు చెల్లించారు. అయితే 600 ఫీట్లకు లోబడి ఇంటిని నిర్మించుకోవాలని చెప్పినా వినకుండా ఇంటి స్లాబ్ వేసుకొన్నాడు దీంతో మిగతా బిల్లు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఎలేంద్ర కుమారుడు మహేందర్ నిత్యం వేధిస్తున్నాడు. తాను ఏమీ చేయలేనని పై అధికారుల ఆదేశాల మేరకే పని చేస్తానని చెప్పడంతో మంగళవారం మహేష్ పంచాయతీ కార్యాలయంలో పడక మంచం, గ్యాస్ స్టవ్, నిత్యావసర వస్తువులు పెట్టాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వచ్చి పంచాయతీ కార్యాలయంలోని వస్తువులను తొలగించారు. ఈ మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.



గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంచం, గ్యాస్ స్టవ్ పెట్టిన దృశ్యం

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



కావ్యను అభినందిస్తున్న అధ్యాపక బృందం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న బరిగే కావ్య జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల చౌటుప్పల్‌లో నిర్వహించిన అండర్-18 మాస్టర్ విభాగంలో గోల్డ్ మెడల్, టైం ట్రయల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి బేష్ అనిపించుకుంది. నవంబరు 15న ఒడిశాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ రెడ్డి, అధ్యాపక బృందం కావ్యను శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో చిన్నకోడూరు కళాశాల ప్రిన్సిపాల్ కూచంగారి శ్రీనివాస్, ఏజీఎంసీ దేవయ్య, స్టాఫ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ కనక చంద్రం, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నంట శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగేష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి అశోక్, కోచ్ వెంకటేష్, అధ్యాపకులు వెంకటరమణ, రఘురాజ్, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక



ఎంపికైన మహిళ జట్టు

తూప్రాన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ జట్లను ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరికిషన్, శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం ఎంపిక నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 101 మంది పురుషులు, 49 మంది మహిళలు మొత్తం 150 మంది హాజరయ్యారని తెలిపారు. ఇందులో 15 మంది పురుషులు, 15 మంది మహిళలను ఉమ్మడి మెదక్ జిల్లా జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 9 వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని వివరించారు. కోశాధికారి నాగగౌడ్, సంయుక్త కార్యదర్శి త్రిశాల్, రాముగౌడ్, ఉపాధ్యక్షులు మిద్దింటి నవీన్, రవి, ప్రకాష్, మహేష్ పాల్గొన్నారు.

కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కపాస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం టేక్మాల్ రైతు వేదికలో శంకరంపేట-ఏ డివిజన్ పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో మొత్తం 21,193 మంది రైతులు 34,903 ఎకరాలలో పత్తి పంటను సాగు చేశారన్నారు. రైతులు దళారులకి అమ్మి మోసపోకుండా జిన్నింగ్ మిల్లుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ చేసేందుకు ఏఎంసీల వారీగా లోకల్ కమిటీలను నియమించి, ఎప్పటికప్పుడు రైతులు మద్దతు ధర పొందేలా కృషి చేయాలన్నారు. అదే విధంగా లీగల్ మెట్రాలజీ అధికారులు తేమ కొలిచే యంత్రాలను పరిశీలించాలన్నారు. అనంతరం వంద శాతం రాయితీపై జొన్న విత్తనాలను రైతులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, ఇన్‌చార్జి ఏడీఏ రాంప్రసాద్, ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

పత్తిని పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలి

మునిపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : కపాస్ యాప్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పాత పద్ధతిలో పత్తిని కొనుగోలు చేయాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి అన్నారు. మంగళవారం మునిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్మార్ట్ ఫోన్లు లేక కొంత మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో రైతుకు ఎన్ని సర్వే నెంబర్లు ఉంటే అన్నింటికీ ఓటీపీలు రావడంతో తిప్పలు తప్పడం లేదని అన్నారు. గతేడాది ఎకరాకు 12 క్వింటాళ్ల కొనుగోలు చేసిన సీసీఐ, ఈసారి 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్, నాయకులు సంగమేశ్వర్, విఠల్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు

సగం రోడ్డు సంతకే..!

- అలంకారప్రాయంగా గజ్వేల్ సమీకృత మార్కెట్
- ఫుట్‌పాత్‌లు, రోడ్డు ఆక్రమణతో వాహనదారులు, పాదాచారులకు తీవ్ర ఇక్కట్లు
- తైబజార్ వ్యాపారులతో అధికారులు కుమ్మక్కు..!

గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోట్లు వెచ్చించి మార్కెట్‌ను నిర్మించినా, కూరగాయల వ్యాపారం మాత్రం రోడ్డుపైనే జరుగుతోంది. దీంతో రాష్ట్రంలోనే ఆదర్శంగా, రూ.30 కోట్ల వ్యయంతో ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన సమీకృత మార్కెట్ ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారింది. నాన్‌వెజ్, పూల మార్కెట్ మినహా, పండ్లు, కూరగాయల దుకాణాలు మళ్లీ రోడ్డుపైకి చేరాయి. దీంతో మార్కెట్ లోపల ఉన్న వ్యాపారులు నష్టపోవడంతో పాటు, రోడ్డుపై వెళ్లే వాహనదారులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వారాంతపు సంత రోజుల్లో భారీ ట్రాఫిక్‌కు సమస్య ఏర్పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో రోడ్డుపై ఒక్క వ్యాపారి కూడా వ్యాపారం చేయకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. కానీ, ప్రస్తుతం మార్కెటింగ్ శాఖ, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు తైబజార్ వ్యాపారుల కోసమే చూసీచూడనట్లుగా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నడవాలంటేనే నరకం

ప్రస్తుతం రోడ్డుపై డివైడర్‌కు నాలుగు అడుగుల మేర, ఫుట్‌పాత్‌కు నాలుగు అడుగుల మేర కూరగాయలు, ఇతర సామాగ్రి దుకాణాలు పెడుతున్నారు. మధ్యలో మిగిలిన నాలుగైదు అడుగుల రోడ్డులో పాదచారులు, వాహనదారులు వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఒక్క వాహనం ఆగినా మొత్తం ట్రాఫిక్ జామ్ అవుతోంది. వెనుక ఉన్న వాహనదారులు, పాదచారులు వాహనాల మధ్యలో నుంచి నడవాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్తున్నారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సంతలో అటు పిక్‌ప్యాకేటర్లు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తుండగా, ఇటు వాహనాలు పాదచారులను తాకడంతో చిన్న చిన్న గాయాలవుతున్నాయి. ఇందిరా పార్కు చౌరస్తా నుంచి డిల్లీ వాలా హోటల్ వరకు వెళ్లాలంటే వాహనదారులకు తలప్రాణం తోకకు వస్తున్న పరిస్థితి నెలకొంది. రోడ్డుపై వ్యాపారం జరగడంతో మార్కెట్ లోపల ఉన్న వ్యాపారస్తులు వ్యాపారం లేక నష్టపోతున్నామని వాపోతున్నారు.



గజ్వేల్ మార్కెట్ రోడ్డుపై కూరగాయల విక్రయం

కార్ల పార్కింగ్ అడ్డాగా..

గజ్వేల్ పట్టణంలో ప్రధాన కూడలిలో నిర్మించిన సమీకృత మార్కెట్ తూర్పు వైపున పెద్ద ఎత్తున ఖాళీ స్థలం ఉంది. అక్కడ కూరగాయలు, ఇతర వ్యాపారులకు అవకాశం కల్పిస్తే రోడ్డుపై దుకాణాలు పెట్టకుండా అడ్డుకోవచ్చు. దీంతో ట్రాఫిక్ సమస్యతో పాటు చిన్న చిన్న ప్రమాదాలకు పరిష్కారం దొరుకుతుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన మార్కెట్‌లో స్టాళ్లు ఉండగా, రోడ్డుపై కూరగాయలు పెట్టించడం పట్ల అధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. తైబజార్ వ్యాపారుల నుంచి అధికారులు నెలనెలా మామూళ్లు తీసుకుంటూ, వారికి వ్యాపారానికి అవకాశం కల్పిస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మార్కెట్ సౌకర్యం ఉన్నా రహదారిపైనే అమ్మకాలు

పరిష్కారం చూపాలి



మార్కెట్‌ను రూ.30 కోట్లతో ప్రజలకు తాజా కూరగాయలు అందించాలని ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం కూరగాయలు, పండ్ల బండ్లు, తోపుడు బండ్లు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు అనేక సమస్యలు వస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలి.

- గోళి సంతోష్‌కుమార్, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నాయకులు

రైతులు, చిరు వ్యాపారులకు కేటాయించాలి



మార్కెట్‌లో నిర్మానుష్యంగా ఉండి, కార్ల పార్కింగ్ చేసే అడ్డాగా మారిపోయింది. రోడ్డుపై కూరగాయలు రావడంతో ట్రాఫిక్ సమస్య, పాదచారుల ఇబ్బందులు పెరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి మార్కెట్‌లోని స్టాళ్లలో విక్రయాలు సాగేలా చూడాలి. అవసరమైతే మార్కెట్‌లో ఖాళీగా ఉన్న స్థలాన్ని రైతులకు, వీధివ్యాపారులకు కేటాయించాలి.

-సుభాష్ చంద్రబోస్, బీజేపీ నాయకులు

సంక్షిప్తం

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

జగదేవ్‌పూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిగుల్ గ్రామానికి చెందిన విద్యార్థి ఎర్రబోయిన గణిత్ రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు ఎంపికయ్యాడు. ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు గాయత్రి పాఠశాల ప్రిన్సిపాల్ సరిత తెలిపారు. ప్రస్తుతం గణిత్ తిగుల్‌లో గాయత్రి ప్రైవేట్ పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. ఈ నెల 9న కర్నూల్‌లో జరిగే ఉమ్మడి రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

నేడు సిద్ధప్ప ఆశ్రమంలో గురుపూజోత్సవం

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలో సిద్ధప్ప వరకవి ఆశ్రమంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నారు. తెలంగాణ వేమనగా ప్రసిద్ధిగాంచిన సిద్ధప్ప విగ్రహం వద్ద ఘనంగా గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమంలో గల వరకవి సమాధి వద్ద గురుపూజోత్సవం, కార్తీక పౌర్ణమి వేడుకలు జరుపుతారు. సరస్వతీ పూజ, గాయత్రి యజ్ఞం, భజనలతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించానున్నారు. కాగా వేడుకలకు ఆశ్రమాన్ని సిద్ధం చేసినట్లు బాధ్యులు అనంత వరం మాణిక్యలింగం తెలిపారు.

గ్రీన్ ఇండియా హరితసేనలో అందరూ భాగస్వాములు కావాలి

ములుగు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఇండియా హరితసేనలో అందరూ భాగస్వాములై మొక్కలు నాటాలని సినీహీరో అనిల్‌మొగిలి పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండలం కొత్తూరు సెవెన్ హిల్స్ పాఠశాలలో ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములై హరితవనం అభివృద్ధి కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

తొగుట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు అమ్మితే ఊరుకునేది లేదని తొగుట ఇన్‌చార్జి ఏవో ప్రియదర్శిని హెచ్చరించారు. మంగళవారం తొగుట మండలం ఎల్లారెడ్డిపేట గ్రామంలో బాలు ట్రేడర్స్ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ షాపును ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట ఏఈవో నాగార్జున పాల్గొన్నారు.

మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడొద్దు

సిద్దిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులను వాడొద్దని సిద్దిపేట ఏడీఏ పద్మ సూచించారు. చిన్నకోడూరు రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 5,394 మంది రైతులకు 2024-25 సంవత్సరానికి గాను భూసార పరీక్ష విశ్లేషణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో జయంత్ కుమార్, ఏఈవోలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఐపీఎం కిట్ల పంపిణీ

సిద్దిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్‌లో కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం (హైదరాబాద్) అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ హొన్నప్పగౌడ ఆధ్వర్యంలో రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా మంగళవారం రైతులకు సమగ్ర సస్య రక్షణ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హొన్నప్పగౌడ మాట్లాడుతూ కొన్ని వారాల నుంచి రైతులకు క్షేత్ర స్థాయిలో మిరప పంట వేసినప్పటి నుంచి చేతికి వచ్చే వరకు పాటించాల్సిన అన్ని సస్య రక్షణ పద్ధతుల పై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అధికారులు సునీత, వెంకట్ రెడ్డి, ఉదయ శంకర్, ఏఈవో శ్రీకాంత్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చదువుతో సమాజంలో మంచి గుర్తింపు

సిద్దిపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చదువుతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో తిరుపతి అన్నారు. చిన్నకోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పాఠశాల సౌజన్యంతో సమకూర్చిన స్పోర్ట్స్ డ్రెస్సులను 40 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

విత్తు నుంచి విక్రయం దాకా..

అడుగడుగునా తిప్పలే..!

- అకాల వర్షానికి తడిసి ముద్దవుతున్న ధాన్యం
- హుస్నాబాద్ డివిజన్‌లో రైతుల కన్నీటి గోస
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తాత్సారం.. దళారులకు వరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పోతారం(ఎస్)లో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతులు

హుస్నాబాద్ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు వరి రైతులను నట్టేట ముంచింది. ఓ వైపు వర్షం.. మరోవైపు నత్తనడకన సాగుతున్న వరి కొనుగోళ్లతో అన్నదాతలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాల నుంచి తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. అయినప్పటికీ చేతికి వచ్చిన పంట నీట మునగడంతో రైతుల గోస వర్ణనాతీతం. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నత్తనడకన సాగడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

అడుగడుగునా అవాంతరాలే..

విత్తు నుంచి పంట విక్రయం వరకు అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలే ఎదురవుతున్నాయి. పంట వేసిన మొదట్లో చీడపీడలు, విత్తనాల కొరత ఎరువుల లభ్యత, వాతావరణ అనుకూలత ఇలా అన్నింటిని దాటుకొని అన్నదాతలు శ్రమకోర్చి పంట పండిస్తే చివరికి పంట విక్రయించుకోవడంలోనూ ఇబ్బందులు తప్పట్లేదు. కాస్తో కూస్తో చేతికొచ్చిన పంట అమ్ముకుందామంటే అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతోంది. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం అంటూ కొర్రీలు పెడుతుండడంతో ఇక్కట్లు తప్పట్లేదు. పోని ధాన్యం నిలువ ఉంచుదామా అంటే స్థలాలు లేని దుస్థితి నెలకొంది. ఏటా రైతాంగానికి పంటలు చేతికొచ్చిన సమయంలో ఈ తిప్పలు తప్పడం లేదు.

డివిజన్‌లో పరిస్థితి ఇలా..

హుస్నాబాద్ డివిజన్‌లోని అక్కన్నపేట, కోహెడ, హుస్నాబాద్ తదితర మండలాల్లో ఆయా గ్రామాలకు చెందిన రైతులు పంటను విక్రయించుకుందామంటే తేమ, తరుగుపేరిట అటు దళారులు, ఇటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర నిరాశ ఎదురవుతుంది. దీనికి తోడు ఈసారి భారీ వర్షాలు కురవడం పంట దిగుబడులు అంతంత మాత్రంగా వచ్చాయి. పంట దిగుబడి తీవ్రంగా తగ్గిందని రైతన్న ఒకవైపు ఆందోళన వ్యక్తం చేస్తుంటే, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ అంటూ పెడుతున్న కోతలు రైతాంగానికి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారిందని వాపోతున్నారు.

అమ్ముకోలేక.. నిల్వ చేయలేక..

ఇటీవల పంటలు కోసే సమయంలో వాతావరణంలో మార్పులు జరిగి పంటలు ఆరబెట్టిన సమయంలో వర్షాలు కురవడంతో చాలా చోట్ల వరి పంట తడిసిపోయిందని, మరికొన్ని చోట్ల చేతికి వచ్చిన పంటను ప్రభుత్వం తేమ శాతం ఉంటేనే కొంటామని చెప్పడంతో కమ్ముకొస్తున్న కారుమబ్బులను చూసి గత్యంతరం లేక తక్కువ ధరకు వచ్చి వడ్లను దళారులకు అమ్ముకోవలిసిన పరిస్థితి తలెత్తుతున్నదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ధాన్యం దళారులకు అమ్ముకోలేక, చేతికి వచ్చిన ధాన్యం నిల్వచేయలేక అవస్థలు పడుతున్నారు.

కోతలై పది రోజులైనా ధాన్యం కొనడం లేదు..



కష్టపడి కౌలుకు తీసుకున్న పొలంలో పంటను వర్షాల భయంతో చైన్‌మిషన్‌తో వరికోతలు చేపట్టాను గంటకు రూ. 3,200 ఇచ్చి ధాన్యం కోసం కొనుగోలు కేంద్రానికి తెచ్చి 10 రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. రోజు వస్తుండ్రు, చూస్తండ్రు నా ధాన్యం మాత్రం కొనడం లేదు. వర్షాలతో రోజూ నరకం అనుభవిస్తున్నా, ధాన్యాన్ని ఆరబెడుతుండగా అంతలోనే వర్షం రావడం దీంతో ధాన్యం మొలకెత్తుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

- కోమల ఆరెపల్లి, హుస్నాబాద్ రైతు

30 ఏళ్లుగా ఇదే గోస ..



నేను ఊహ తెలిసినప్పటి నుంచి వ్యవసాయం చేస్తున్నా. అయితే ఎన్నడూ సుఖంగా జీవించింది లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్మకం సమయంలో అరిగోస పడాల్సి వస్తుంది. వరి కోత కోసిన నుంచి వర్షం పడుతుంది. ధాన్యం ఆరబోయాలంటే ప్రాణంమీదికొస్తోంది. కాని మా గోస పట్టించుకునే వారు లేరు. ఎన్నికలు వచ్చినప్పుడే మేము గుర్తుకు వస్తాం. కాని ఆ తర్వాత మా గోస దేవుడెరుగు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి మా ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

-ఆలేటి రవీందర్‌రెడ్డి, పోతారం(ఎస్)

ద్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 26 మందికి జరిమానా

- నిందితుల్లో ఇద్దరికి 3 రోజులు.. ఒకరికి 5 రోజుల జైలు

హుస్నాబాద్/గజ్వేల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 26 మందిని మంగళవారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా న్యాయాధికారులు వారికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మొత్తం రూ. 2,34,500 జరిమానా విధించారు. నిందితుల్లో ముగ్గురికి జరిమానాతో పాటు జైలు శిక్ష సైతం విధించారు. మంగళవారం హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోహెడ, హుస్నాబాద్, అక్కన్నపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 14మంది పట్టుబడినట్లు పేర్కొన్నారు. కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో 9మంది, అక్కన్నపేట పరిధిలో ఇద్దరు, హుస్నాబాద్ పరిధిలో ముగ్గురు పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. పట్టుబడిన వారిని హుస్నాబాద్ కోర్టులో హాజరు పరచగా హుస్నాబాద్ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రాజశేఖర్‌రెడ్డి మొత్తం రూ. 1.40 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. అదేవిధంగా గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 12మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరు పరచగా విచారణ అనంతరం వారికి మొత్తం రూ.94,500 జరిమానా విధించారు. నిందితుల్లో ఇద్దరికి 3 రోజుల పాటు, మరొకరికి 5 రోజులపాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

బాల్య వివాహాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో విక్రమ్

మర్కుక్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి మంగళవారం ఉదయం స్థానిక ఎంపీడీవో విక్రమ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతీఫ్ సైదా అధ్యక్షతన ఏర్పాటు చేసిన బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో విక్రమ్ హాజరయ్యారు. పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను గురించి వివరించారు. కార్యక్రమంలో స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దెబోరా రాణి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తాం: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్

సిద్దిపేట అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీపీఐ(భారత కమ్యూనిస్టు పార్టీ) 100 ఏళ్ల ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలకు సంబంధించి మంగళవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న దేశంలో సీపీఐ పార్టీ 100 ఏళ్ల పూర్తి చేసుకోబోతుందన్నారు. ఖమ్మంలో జరిగే సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయానంద రెడ్డి, కొమ్ముల భాస్కర్, కిష్టపురం లక్ష్మణ్,యెడల వనేశ్, జేరిపోతుల జనార్దన్, పిల్లి రజిని, జిల్లా కౌన్సిల్ సభ్యులు గజాభీమకర్ బన్సీలాల్, వేల్పుల శ్రీనివాస్, శివలింగ కృష్ణ, మిట్టపల్లి సుధాకర్, ఆది రంగారెడ్డి, రామగళ్ల నరేష్, సంగెం మధు, బొజ్జపురి రాజు, స్వర్గం రాజేశం, ముంజ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఓబీ, ఈసీ సభ్యులకు రెండు రోజుల శిక్షణ

మద్దూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాగృతి సమాఖ్య కార్యాలయంలో ఆఫీస్ బేరర్స్ మండల సమాఖ్య ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులకు మండల సమాఖ్య అధ్యక్షురాలు స్రవంతి అధ్యక్షతన సీనియర్ సీఆర్పీల ఆధ్వర్యంలో మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నిర్వాహణ, గ్రామ సమాఖ్యల నిర్వాహణపై సీనియర్ సీఆర్పీలు మాధవి, పద్మ అవగాహన కల్పించారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశ హాజరుశాతం పెంచుకోవడంతో పాటు ఆర్థిక పరమైన లావాదేవీలను సక్రమంగా నిర్వహించుకోవాలని తెలిపారు. ఏపీఎం ఖాతా ప్రకాశం, సీసీ మహేందర్, చంద్రమౌళి, కనకచంద్రం, సాయిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఐఈవో రవీందర్‌రెడ్డి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ అత్యంత ముఖ్యమైన దశ అని, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా ప్రత్యేక అధికారి, మేడ్చల్ డీఐఈవో కిషన్‌తో కలిసి మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఈనెల 15 వరకు కొనసాగుతాయని, ప్రిన్సిపాల్, అధ్యాపకులు సమయపాలన, బోధనలో మెలకువలను పాటిస్తూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కళాశాలలో వసతులు, ఎఫ్ ఆర్ ఎస్, యుడైస్, టీచింగ్ డైరీలు, కళాశాల రికార్డులు అధ్యాపకుల హాజరు, తదితర అంశాలను పరిశీలిస్తున్నట్లు వివరించారు. అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు అయ్యాయని, హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు గడువులోగా సిలబస్ పూర్తిచేసి, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. కాగా డీఐఈవో రవీందర్ రెడ్డి గజ్వేల్‌లోని కళాశాలలు తనిఖీ చేయగా ప్రత్యేక అధికారి కిషన్ పట్టణంలోని ప్రైవేట్, మైనార్టీ, రెసిడెన్షియల్ కళాశాలలను తనిఖీ చేసి పలు సూచనలు అందించారు.

ప్రత్యేక వేషధారణతో అలరించిన విద్యార్థులు



ప్రత్యేక వేషధారణలో గురువన్నపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

కొమురవెల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురువన్నపేట ప్రాథమిక పాఠశాలలోని 5వ తరగతి విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. 5వ తరగతి విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశంలోని ప్యారా హైదరాబాద్ అనే పాఠం గురించి సవివరంగా అర్థం చేయించేందుకు హైదరాబాద్‌లో వివిధ ఉత్సవాల్లో జరిగే విధంగా విద్యార్థుల చేత మంగళవారం వేషధారణ వేయించి హైదరాబాద్ గొప్పతనం, ప్రజల జీవన విధానం తెలిసేలా ఉపాధ్యాయుడు గిరిబాబు విద్యార్థులకు బోధించారు. వివిధ వేషధారణలతో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా డీజేలు ఉపయోగించొద్దు

రాయపోల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలకైనా డీజేలు ఉపయోగించరాదని రాయపోల్ ఎస్ఐ మానస పేర్కొన్నారు. సిటీ పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నందున శుభకార్యాలకు, ఊరేగింపులకు అనుమతి తీసుకొని డీజేలను ఉపయోగించుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా డీజేలు వాడినా, అనుమతి తీసుకున్నా రాత్రి 10 గంటల తర్వాత వాడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎర్రవల్లి గ్రామాన్ని సందర్శించిన డీపీవో



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో వినోద్‌కుమార్

మర్కుక్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామాన్ని జిల్లా పంచాయతీ అధికారి వినోద్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి విద్యావికాస్‌రెడ్డితో గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ పారిశుధ్యపనుల పర్యవేక్షణపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశంకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎల్పీవో లత, ఎంపీవో శాంతి, అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి, ఆయా ఎల్లమ్మ, ఆశా కార్యకర్త భాగ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హామీలు నెరవేర్చకుంటే పోరుబాట



వంగ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హమీలను వెంటనే అమలు చేయాలని ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వంగ మహేందర్‌రెడ్డిని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రాష్ట్రశాఖ ప్రకటించిన సందర్భంగా పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ నెలలోపు అన్ని హామీలు నెరవేరుస్తామని మేనిఫెస్టోలో పొందుపరచడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్ల సమయమిచ్చి వేచిచూశామన్నారు. డిసెంబర్ 9 లోపు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే పీఆర్టీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిరంతరం ఉపాధ్యాయులకు పాఠశాలలకు సేవలందిస్తున్న గొప్ప నాయకుడు మహేందర్ రెడ్డి అని శ్రీపాల్ రెడ్డి కొనియాడారు.

ఏఎన్ఎం, ఆశాలు పనిలో మరింత శ్రద్ధ చూపాలి

మద్దూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పీహెచ్‌సీ పరిధిలో మండల ప్రజలకు అందిస్తున్న సేవలపై ఏఎన్ఎంలు, ఆశాలు విధినిర్వహణలో మరింత శ్రద్ధ చూపాలని మద్దూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి సీహెచ్ మహేందర్ సూచించారు. మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆశాలకు, ఏఎన్ఎంలకు విధించిన టార్గెట్‌ను చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు అయ్యేలా చూడాలన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలే లేకుండా చూడాలన్నారు. ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని సూచించారు. జ్వరాలతో బాధపడే వారిని ఆస్పత్రికి పంపించే విధంగా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో యూడీసీ సదయ్య, సీహెచ్‌వో ప్రకాశ్, స్టాఫ్ నర్స్ మాధవి, ఫార్మాసిస్ట్ సందీప్‌తో పాటు ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రైతులకు భరోసా కల్పించడంతో బీమా కంపెనీలు విఫలం

కోహెడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినపుడు రైతులకు భరోసా కల్పించడంలో దేశంలో ఇన్సూరెన్స్ కంపెనీలు పూర్తిగా విఫలమయ్యాయని దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జేరిపోతుల కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కోహెడ మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ సీజనల్ క్రాఫ్ కి రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకునే విధంగా ప్రభుత్వాలు ఇన్సూరెన్స్ కంపెనీలు, ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. విపత్తుల సంబంవించినప్పుడు బీమా ద్వారా రైతు ఆర్థిక ఇబ్బందులు ఉండి బయటపడవచ్చన్నారు.



హుస్నాబాద్ పట్టణంలోని సిద్దిపేట రోడ్డులో నిర్మాణం పూర్తికాని నేషనల్ హైవే వరదనీటి కాలువ

జలగండం

(3వ పేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టారు. దీంతో వరద నీరు సాఫీగా పోవడం లేదు. కొన్ని చోట్ల పనులు మధ్యలో వదిలేయడం వల్ల కూడా వరద నీరు రోడ్డుపైకి వస్తోంది. ప్రస్తుతం ఉన్న లోటుపాట్లను సరిదిద్దితే కొంతవరకు సమస్య తీరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

రూ. 80కోట్లతో ప్రతిపాదనలు

వర్షాలు వచ్చినప్పుడల్లా పట్టణం జలదిగ్బంధం అవుతుండటంతో, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమస్య నివారణకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. దీనిపై స్పందించిన హైదరాబాద్‌కు చెందిన పబ్లిక్ హెల్త్ అధికారులు ఐదు రోజుల క్రితం హుస్నాబాద్ పట్టణంలో పర్యటించారు. వరద నీటిని మళ్లించేందుకు పలు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనల ప్రకారం, శాశ్వత పరిష్కారానికి రూ. 80 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ నిధులను త్వరగా మంజూరు చేసి హుస్నాబాద్ పట్టణ ప్రజలకు జల గండం నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

యువజనోత్సాహం

(3వ పేజీ తరువాయి)

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. ఈ నెల 18న జరిగే ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగినవారు సంబంధిత శాఖ జారీ చేసిన జనన ధృవీకరణ పత్రం లేదా పదవ తరగతి మెమో, 3పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో యువజన క్రీడల శాఖలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

యువత ప్రతిభకు మంచి వేదిక



యువజన ఉత్సవాల వల్ల యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం కలుగుతుంది. జిల్లా నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లే అద్భుత అవకాశం. నూతన ఆవిష్కరణకు వేదిక అవుతుంది. ఈ అవకాశాన్ని జిల్లా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి.. మరిన్ని వివరాలకు 9441925763, 7780577861 నెంబర్లను సంప్రదించవచ్చు. అలాగే సైన్స్ మేళా గురించి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ 98496 99382 నంబర్‌ను సంప్రదించాలి.

- జంగపల్లి వెంకటనర్సయ్య, డీవైఎస్‌వో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో జిల్లా నుంచి నాయకులు



ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

తొగుట/గజ్వేల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్ పేట డివిజన్ 4, 5 వ వార్డుల్లో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డితో కలిసి దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ కోఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోలిపేట ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ లోని రహమత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, టీఎంసీ చైర్మన్ సయ్యద్ మతీన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయన వెంట నాయకులు మోహన్, వహీద్, జహంగీర్, అతావుల్లాబేగ్, హసన్ తదితరులున్నారు.

- **ములుగు:** జూబ్లీహిల్స్‌లో జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తుందని మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు జుబేర్ అన్నారు. మంగళవారం ఎన్నికల్లో ఎర్రగడ్డ డివిజన్‌లో రాజీవ్‌నగర్‌లో మాగంటి సునీతమ్మ గోపీనాథ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ములుగు మండల జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, గజ్వేల్ నియోజకవర్గం సోషల్ మీడియా ఇన్‌చార్జి కొమ్ము నవీన్‌కుమార్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్ కౌన్సిలర్ చందు, నాయకులు పాల్గొన్నారు.



రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం